క్లుప్తంగా

మెగా ఉచిత నేత్ర వైద్య శిబిరానికి స్పందన



తెనాలి అర్బన్: స్థానిక హెల్త్ హాస్పిటల్ ఆధ్వర్యంలో మార్కెట్ యార్డులో గురువారం ఏర్పాటు చేసిన మెగా ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని చైర్‌పర్సన్ అవుతు సీత ప్రారంభించారు. అనంతరం వైద్యులు యార్డులో పనిచేసే ఉద్యోగులు, ముఠా కార్మికులు, సిబ్బందికి కంటి, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ హాస్పిటల్ సీఈవో గిరిబాబు, యార్డు ఉపాధ్యక్షుడు ఒప్పుగల్ల కృష్ణ, కార్యదర్శి జె.వెంకట సుబ్బారావు, ఎమ్మెల్యే పీఏ సునీల్ పాల్గొన్నారు.

శాంతీనగర్‌లో సీపీఎం సమరభేరి



తెనాలి అర్బన్: సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమరభేరి కార్యక్రమాన్ని 24వ వార్డు శాంతీనగర్‌లో గురువారం నిర్వహించారు. నేతలు ఆ ప్రాంతంలో పర్యటిస్తూ ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు ఎన్.భావన్నారాయణ, షేక్ హుస్సేన్‌వలీ, పి.జోనేష్, టి.సుబ్రహ్మణ్యం, కె.రవికుమార్, కె.వి.ప్రసాద్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరంలో విద్యార్థులకు పరీక్షలు



తెనాలి టౌన్: రూరల్ మండలం బుర్రిపాలెంలో గురువారం సూపర్‌స్టార్ మహేష్‌బాబు తనయుడు గౌతమ్‌కృష్ణ పుట్టిన రోజు సందర్భంగా ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఆంధ్రా హాస్పిటల్ విజయవాడ సౌజన్యంతో నిర్వహించిన శిబిరంలో పాఠశాల విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. డాక్టర్ ముదసిర్, డాక్టర్ ఆశ్రిత, డాక్టర్ శ్రావ్య, డాక్టర్ శ్రియ సేవలందించారు. విద్యార్థులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వర్షాకాలంలో వచ్చే వ్యాధులు, జబ్బులు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో ఆంధ్రా హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ సంఘానికి మార్చురీ బాక్సు వితరణ




తెనాలి: పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘానికి కడలి కిశోర్ ఆర్థికసాయంతో శ్రీ సాంబశివ ఏసీ వర్క్స్ ప్రత్యేకంగా భౌతికకాయాన్ని కూర్చోబెట్టేలా తయారు చేసిన మార్చురీ బాక్సును గురువారం అందజేశారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు గుంటముక్కల అర్జున్, కార్యదర్శి కడియం శౌరంబాబు, కోశాధికారి తురుపాల లక్ష్మీప్రసాద్, కడియాల నాగేశ్వరరావు, గార్ల నరేంద్ర, పెంట శ్రీనివాస్, సురేష్, నక్కా ప్రభాకర్, దేవు గిరి, కట్టాజు పరమేశం, మందుగుల రమేష్ పాల్గొన్నారు. కడలి దామోదరరావు జ్ఞాపకార్థం ఈ వితరణ చేసినట్టు తెలియజేశారు.

భక్తిశ్రద్ధలతో సత్యనారాయణ స్వామి వ్రతాలు



తెనాలి టౌన్: బోసు రోడ్డులోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో టీటీడీ, హిందూధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సహకారంతో గురువారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాల్ని నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం వరకు జరిగిన వ్రతాల్లో 50మంది దంపతులు పాల్గొన్నారు. అర్చకులు రామలింగంశర్మ సత్యనారాయణ స్వామి పూజ, నవగ్రహ పూజ, వ్రత కథను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ధర్మ ప్రచార పరిషత్ జిల్లా ప్రోగ్రాం అసిస్టెంట్ అమ్ముడు, అన్నమాచార్య వెంకటేశ్వరర సంకీర్తన బృందం పర్యవేక్షణలో కార్యక్రమం జరిపారు.

ఉపాధ్యాయురాలికి ఏఎన్‌యూ డాక్టరేట్



గుంటూరు ఎడ్యుకేషన్: కేవీపీ కాలనీ కేఎస్ఆర్టీ నగరపాలకసంస్థ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్న ఎస్‌సీహెచ్ సుధా మైథిలికి ఏఎన్‌యూ పీహెచ్‌డీ పట్టా ప్రదానం చేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.రాంబాబు గురువారం తెలిపారు. శ్రీ పువ్వాడ తిక్కన సోమయాజి సాహిత్యానుశీలనం అనేఅంశంపై గుమ్మా సాంబశివరావు పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు గాను ఇటీవల ఏఎన్‌యూలో జరిగిన స్నాతకోత్సవంలో పీహెచ్‌డీ పట్టా అందుకున్నారని పేర్కొన్నారు.

పేదవాడిని ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే శివకుమార్



సంక్షేమ పథకాల గురించి వృద్ధురాలికి వివరిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి టౌన్: నవరత్నాల ద్వారా సంక్షేమ పథకాల్ని అమలు చేస్తూ, అర్హుల్ని అనేక విధాలుగా ప్రభుత్వం ఆదుకుంటున్నట్లు ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ తెలిపారు. రూరల్ మండలం కొలకలూరులో ఎనిమిదో రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. సచివాలయ సిబ్బంది, అధికారులు, వలంటీర్లతో కలసి ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లారు. ప్రజల సమస్యలతో పాటు సంక్షేమ పథకాలు అందుతున్నాయో.. లేదో ? అడిగి తెలుసుకున్నారు. ప్రజలు తెలియజేసిన సమస్యల్ని సచివాలయ సిబ్బంది నమోదు చేసుకున్నారు. డ్రెయిన్స్ ఏర్పాటు చేయాలని, డొంక రోడ్ల నిర్మాణం చేపట్టాలని ప్రజలు, రైతులు కోరారు. వాటిని పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో 26వేల మందికి ఇళ్ల స్థలాలు మంజూరు చేసినట్లు తెలిపారు. ఇళ్ల నిర్మాణానికి రూ.1.80లక్షలతో పాటు డ్వాక్రా గ్రూపుల్లో ఉన్న వారికి రూ.30వేలను బ్యాంకుల ద్వారా ఇప్పిస్తున్నట్లు చెప్పారు. తెలుగుదేశం నాయకులకు గత ఎన్నికల్లో ప్రజలు సరైన గుణపాఠం చెప్పారని, రాబోయే ఎన్నికల్లో మళ్లీ అదే జరుగుతుందని ఆయన తెలిపారు. పేదవాడిని ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే శివకుమార్ చెప్పారు. అనంతరం అనారోగ్యానికి గురై ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్ గద్దె వెంకట్రావును ఎమ్మెల్యే పరామర్శించారు. పార్టీ నాయకులు అండగా ఉంటారని, ధైర్యంగా ఉండమని ఆయనకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యులు కాలిశెట్టి ఫణికుమార్, నాగదేవిక, డీసీఎంఎస్ డైరెక్టర్ ప్రసాదం బాలగురవమ్మ, పార్టీ నాయకులు మల్లిశెట్టి శ్రీనివాస్, బండి శ్రీనివాస్, తాడిబోయిన శ్రీనివాస్, గద్దె హనుమంతరావు, గాజుల శ్రీనివాసరావు, ప్రసాదం సురేష్, అంచే రోశయ్య, కొలకలూరి నాగేశ్వరరావు, మల్లవరపు విజయ్, బుల్లయ్య, పినపాటి అనిల్, కార్తికేయ, పోలిశెట్టి కోటేశ్వరరావు, తులాబందుల చినచిట్టిబాబు, లక్ష్మీ కోటేశ్వరరావు, పామర్తి సుబ్బారావు, కె.రాజయ్య, కొమ్ము రాయల్, ఎంపీడీవో విజయాలక్ష్మణ్, తహసీల్దార్ రవిబాబు, పంచాయతీ కార్యదర్శి వై.వి.డి.ప్రసాద్, వీఆర్వోలు సురేష్, నితీష్‌కుమార్ పాల్గొన్నారు.

సమస్యలపై కౌన్సిలర్ల ఏకరువు



అధికారులను ప్రశ్నిస్తున్న వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు రామయ్య, లక్ష్మీలావణ్య, శిరీష



సమావేశానికి అధ్యక్షత వహించిన చైర్‌పర్సన్ ఖలేదా నసీమ్

పనిచేయని కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

తెనాలి అర్బన్: వార్డుల్లో సమస్యలపై పలువురు వైఎస్సార్ సీపీ, టీడీపీ కౌన్సిలర్లు ఏకరువు పెట్టారు. వాటిని పరిష్కరించాలని కోరడంతో పాటు అభివృద్ధి పనులు చేయని కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తెనాలి మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని గురువారం కౌన్సిల్ హాలులో చైర్‌పర్సన్ సయ్యద్ ఖాలేదా నసీమ్ అధ్యక్షతన నిర్వహించారు. ముందు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి, కాంట్రాక్ట్ నియామకాలకు సంబంధించిన ప్యానల్ కమిటీని ప్రకటించారు. ఇందులో వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు కొమరబత్తిని జయపాల్, ఆవుల కోటయ్య, తిరుమలశెట్టి సామ్రాజ్యం ఉన్నారు. అనంతరం సాధారణ సమావేశాన్ని నిర్వహించారు. అజెండాలోని 45వ అంశం చదవడం పూర్తి కాగానే, చైర్‌పర్సన్ ప్యానల్ కమిటీ సభ్యులుగా వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు అన్నాబత్తుని పద్మజ, పెదలంక లక్ష్మీలావణ్య, షేక్ దుబాయ్ బాబు, పేరం సంజీవరెడ్డిని నియమిస్తున్నట్లు చైర్‌పర్సన్ ఖాలేదా నసీమ్ ప్రకటించారు. అనంతరం మిగిలిన నాలుగు అంశాలు చదవి ఆమోదించిన తర్వాత జీరో అవర్ నిర్వహించారు.

■ 23,24,25 వార్డుల కౌన్సిలర్లు తోక శిరీష, పెదలంక లక్ష్మీలావణ్య, తాడిబోయిన రామయ్య మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు కాలనీలోని రాజీవ్ గృహకల్పలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని తెలిపారు. వ్యర్థాలు బయటకు వచ్చి దుర్గంధభరితంగా మారిందని, ప్రతిరోజు నివాసితులు తమ ఇళ్లకు వచ్చి ఆవేదన వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. గత మున్సిపల్ కౌన్సిల్‌లో వెంటనే డ్రైనేజీని పునరుద్ధరిస్తామని చైర్‌పర్సన్ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అయితే, నేటి వరకు కాంట్రాక్టర్ పనులు చేయలేదని తెలిపారు. కాంట్రాక్టర్‌కు ఇప్పటికే రెండు నోటీసులు ఇచ్చినట్లు మున్సిపల్ ఇంజనీర్ నాగమల్లేశ్వరరావు వివరణ ఇచ్చారు. కాంట్రాక్టర్‌తో పనులు చేయించాలని, లేనిపక్షంలో అతడ్ని బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలని కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. దీనిపై చైర్‌పర్సన్ ఖాలేదా నసీమ్ కలుగజేసుకున్నారు. పనులు చేయని కాంట్రాక్టర్‌పై చర్యలతో పాటు త్వరగా డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని అధికారుల్ని ఆదేశించారు.

■ 11వ వార్డు కౌన్సిలర్ కఠారి రత్నకుమారి మాట్లాడుతూ తన వార్డులో మంచినీటి పైపుల నుంచి మురుగు నీరు వస్తోందని, దాన్ని పరిష్కరించాలని కోరారు. మురుగునీరు రాకుండా చర్యలు తీసుకుంటామని ఏఈ చైతన్య హామీ ఇచ్చారు.

■ తన వార్డులో బస్టాప్ ఏర్పాటు చేయాలని, లింగారావు ఇంటి సమీపంలో రోడ్లు, కాల్వలు నిర్మించాలని 27వ వార్డు టీడీపీ కౌన్సిలర్ బోయపాటి అరుణ కోరారు. రోడ్లు, కాల్వల ఏర్పాటుకు టెండర్లు పిలిచినట్లు చైర్‌పర్సన్ తెలిపారు.

■ సమావేశంలో కౌన్సిలర్లు అన్నం పిన్నారావు, షేక్ ఇస్మాయేల్, ఆవుల కోటయ్య దోమలు, రోడ్లు, కాల్వల సమస్యల్ని ప్రస్తావించారు. వాటిని పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. అనంతరం సమావేశాన్ని ముగించినట్లు చైర్‌పర్సన్ ప్రకటించారు. సమావేశంలో కమిషనర్ ఎం. జశ్వంతరావు, అసిస్టెంట్ కమిషనర్ అనూష, పలువురు మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

మంచి, చెడు స్పర్శలపై అవగాహన అవసరం



విద్యార్థినులకు అహగాహన కల్పిస్తున్న న్యాయవాది ప్రత్యూష

తెనాలి రూరల్: 18 ఏళ్లలోపు బాలికలు మంచి చెడు స్పర్శలపై అహగాహన కలిగి ఉండాలని న్యాయవాది పేట ప్రత్యూష సూచించారు. స్థానిక కొత్తపేటలోని దొడ్డపనేని ఇందిర బాలికోన్నత పాఠశాలలో గురువారం మంచి, చెడు స్పర్శలపై అహగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కిశోర బాలికలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి వివరించారు. యుక్త వయసులో ఉన్న పిల్లలు తీసుకోవాల్సిన పలు జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. ప్రత్యూష మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులే కాకుండా తెలిసిన వారు సైతం బాలికలతో చెడుగా ప్రవర్తించే సందర్భాలు ఉంటాయని తెలిపారు. అలాంటి ఘటన ఎదురైతే వెంటనే సమీపంలోని గ్రామ, వార్డు సచివాలయంలో లేదా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. 18 ఏళ్లలోపు కిశోర బాలికలు దేశభక్తి కలిగి ఉండాలని ఆమె తెలిపారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, పోషకాహారం తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం మహిళలకు రక్షణ కవచంగా ఉన్న దిశ యాప్ ఉపయోగాలను వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శివ బసవమ్మ, వీరాంజనేయులు, న్యాయసేవాధికార సంస్థ సిబ్బంది షేక్ మహబూబ్, విద్యార్థినులు పాల్గొన్నారు,

చికిత్స పొందుతూ ఆటో డ్రైవర్ మృతి

తెనాలి రూరల్: అనారోగ్య సమస్యలతో ఆత్మహత్యాయత్నం చేసిన ఆటో డ్రైవర్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణ నాజరుపేటకు చెందిన ఆటో డ్రైవర్ గండికోట కిశోర్(43) కాలేయ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ నేపథ్యంలో ఈ నెల ఆగస్టు 27న గడ్డిమందు కొని తాగాడు. తొలుత కుటుంబ సభ్యులు తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం గుంటూరు జీజీహెచ్‌కు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం కిశోర్ మృతి చెందాడు. వైద్యశాల నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు వన్‌టౌన్ సీఐ కె. చంద్రశేఖర్ తెలిపారు.

దాడిపై కేసు నమోదు



కొల్లిపర: కులం పేరుతో దూషించడమే కాకుండా వ్యక్తిపై దాడి చేసిన సంఘటన మండల పరిధిలోని దంతపలూరులో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం...గ్రామానికి చెందిన దర్శి ఏలియా పొలంలో నీళ్లు పెడుతుండగా.. అదే గ్రామానికి చెందిన పెదిశెట్టి గంగయ్య దాడి చేశాడు. తాను పొలానికి నీళ్లు పెట్టుకున్న తర్వాతే పెట్టుకోవాలంటూ ఏలియాను కులం పేరుతో దూషించడమే కాకుండా దాడి చేశాడు. దీంతో అతడు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విశ్వకర్మ యోజన పథకానికి ఉచితంగా ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్



మాట్లాడుతున్న దిలీప్‌రాజా

తెనాలి: ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకానికి అర్హత గల చేతి వృత్తిదారులకు కామన్ సర్వీస్ సెంటర్‌తో ఉచితంగా ఆన్‌లైన్ రిజిస్ట్రేషను చేయించనున్నట్టు సినీ దర్శకుడు, స్వచ్ఛంద సంస్థ పెన్నీ మినిస్ట్రీస్ వ్యవస్థాపకుడు దిలీప్‌రాజా వెల్లడించారు. స్థానిక రత్న ఫార్చ్యూన్ కల్యాణ మండపంలో గురువారం సాయంత్రం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చేతివృత్తులపై ఆధారపడి జీవించే వారికి ప్రభుత్వం శిక్షణనిస్తుందన్నారు. ఈ సమయంలో రోజుకు రూ.500తో పాటు రూ.15 వేల విలువచేసే పనిముట్లను అందజేస్తుందని తెలిపారు. అనంతరం తొలి విడత రూ.లక్ష (18 నెలలకు తిరిగి చెల్లింపు), రెండో విడత రూ.2 లక్షల (30 నెలలకు తిరిగి చెల్లింపు)ను ఏడాదికి అయిదు శాతం వడ్డీతో రుణం కల్పిస్తుందని చెప్పారు. వడ్రంగి, పడవల తయారీ, కమ్మరి, స్వర్ణకారులు, కుమ్మరి, శిల్పకారులు, చర్మకారులు, చెప్పులు కుట్టేవారు, తాపీ పనిచేసేవారు, బొమ్మల తయారీదారులు, క్షురకులు, రజకులు, దర్జీలు, చేపల వల తయారీదారులకు ఈ పథకం వర్తింస్తుందని ఆయన వివరించారు. ఆసక్తి కలిగినవారు తమ వృత్తి, ఆధార్ కార్డు, బ్యాంక్ పాస్‌బుక్, ఆధార్‌కు అనుసంధానమైన ఫోన్ నంబరు ఫొటోస్టాట్ కాపీలను రత్న ఫార్చ్యూన్ కల్యాణ మండపంలో అందజేయాలని ఆయన కోరారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ఖర్చును తాము భరిస్తామని తెలిపారు. అనంతరం క్యాంప్ నిర్వహించే తేదీని తెలియజేస్తామని చెప్పారు. సమావేశంలో కామన్ సర్వీస్ సెంటర్ ప్రతినిధి దాసరి శివన్నారాయణ, బండ్ల రమణయ్య, అమీర్ చౌదరి పాల్గొన్నారు.

ముస్లిం మైనార్టీలకు అండగా ఉంటాం



ఎమ్మెల్యే ముస్తఫాకు వినతిపత్రం అందజేస్తున్న సంస్థల ప్రతినిధులు

పట్నంబజారు: ముస్లిం మైనార్టీల కోసం సేవా కార్యక్రమాలు నిర్వహించే మజ్లీస్ ఉలేమా – జమైతుల్ ఉలేమా సంస్థలు గత 60 సంవత్సరాలుగా విద్య, వైద్యం, చట్ట సామాజిక సేవలు అందిస్తున్నారని, సంస్థకు సొంత కార్యాలయం లేక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో కార్యాలయం ఏర్పాటుకు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా దృష్టి సారించారు. ఈ మేరకు ఆ అంశాన్ని నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు, నగర కమిషనర్ కీర్తి చేకూరి దృష్టికి తీసుకుని వెళ్లారు. బ్రహ్మానందరెడ్డి స్టేడియం సమీపంలోని రెడ్ ట్యాంక్‌లో ఉన్న 900గజాల స్థలాన్ని ఇచ్చేందుకు మేయర్ మనోహర్‌నాయుడు సుముఖత చూపారు. ఈ విషయంపై త్వరలో జరిగే కౌన్సిల్ సమావేశంలో కౌన్సిల్ ఆమోదం కోసం మేయర్ కావటి, కమిషనర్ కీర్తి దృష్టికి తీసుకుని వెళ్లాలని సంస్థల ప్రతినిధులు ఎమ్మెల్యే ముస్తఫాను కోరారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే ముస్తఫా తీర్మానం చేయాలని మేయర్, కమిషనర్‌ను కోరారు. దీనిపై సంస్థల ప్రతినిధులు గురువారం బీఆర్ స్టేడియం సమీపంలోని ఆయన కార్యాలయంలో ఎమ్మెల్యే ముస్తఫాను కలిసి కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు.

వలంటీర్ల పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో మొత్తం 207 వార్డు సచివాలయాల్లో ఖాళీగా ఉన్న 122 వార్డు వలంటీర్ల పోస్టులను భర్తీ చేయుటకు సెప్టెంబర్ 2న అన్ని వార్డు సచివాలయాల నోటీసు బోర్డుల్లో ఖాళీల వివరాలను ప్రచురిస్తామని నగర కమిషనర్ కీర్తి చేకూరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వార్డు వలంటీర్ పోస్టుకు దరఖాస్తుదారుడు, 10వ తరగతి/ తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణులై , ఆగస్ట్ 31, 2023 నాటికి 18 సంవత్సరాలు నిండినవారై, 35 సంవత్సరములు మించని వారై ఉండాలన్నారు. దరఖాస్తుదారుని ఆధార్ కార్డు చిరునామా సంబంధిత మున్సిపాలిటీ పరిధికి సంబంధించి ఉండాలన్నారు. సెప్టెంబర్ 3 నుంచి 6 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. సెప్టెంబర్ 7, 8 తేదీల్లో ఆన్‌లైన్‌లో దాఖలైన దరఖాస్తులను పరిశీలించి, 12, 13 తేదీల్లో మౌఖిక పరీక్షలు నిర్వహించి ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ఎంపికైన వార్డు వలంటీర్లు సెప్టెంబర్ 15 నుంచి విధుల్లో చేరాల్సి ఉంటుందని తెలిపారు.

దిశ పీఎస్‌ను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ



పోలీస్ అధికారులతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ ఆరిఫ్‌హఫీజ్

నగరంపాలెం: దిశ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసులపై ప్రత్యేక దృష్టిసారించి, త్వరితగతిన దర్యాప్తు చేయాలని జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్ అన్నారు. నగరంపాలెంలోని దిశ పోలీస్‌స్టేషన్‌ను గురువారం జిల్లా ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరిసరాలను పరిశీలించి, పరిశుభ్రంగా ఉంచాలని ఎస్పీ సూచించారు. ఫిర్యాదుదారులతో మర్యాదగా మెలగాలని చెప్పారు. ప్రతి ఫిర్యాదు తప్పకుండా రిసెప్షన్ రిజిస్ట్రార్‌లో నమోదు చేయడంతోపాటు రశీదులు ఇవ్వాలని ఆదేశించారు. ఎస్పీ వెంట దిశ డీఎస్పీ కేసీహెచ్ రామారావు, ట్రాఫిక్ డీఎస్పీ బాలసుందరరావు, దిశ పీఎస్ సీఐ శ్రీనివాసరావు, ఎస్‌బీ ఇన్‌చార్జి సీఐ బాలసుబ్రహ్మణ్యం ఉన్నారు.

విద్యార్థులు రక్తదాన ఆవశ్యకత గుర్తించాలి



డాక్టర్ సుష్మాను సత్కరిస్తున్న జ్యోత్స్నకుమారి, రోటరీ క్లబ్ ప్రతినిధులు, అధ్యాపకులు

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులు రక్తదాన ఆవశ్యకతను గుర్తించాలని ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి పేర్కొన్నారు. గురువారం సాంబశివపేటలోని కళాశాలలో ఎన్ఎస్ఎస్, మహిళా సాధికారత విభాగాలతో పాటు రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు ఆధ్వర్యంలో రక్తదాన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ జ్యోత్స్నకుమారి మాట్లాడుతూ రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని సూచించారు. బ్లోసమ్స్ ఆస్పత్రికి చెందిన డాక్టర్ సుష్మా మాట్లాడుతూ రక్తదానం చేయడంలో ఎటువంటి అపోహలు అవసరం లేదని, ఆరోగ్యంగా ప్రతి ఒక్కరు రక్తదానం చేయవచ్చని తెలిపారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు కేవీ భాస్కర్ మాట్లాడుతూ క్లబ్ ఆధ్వర్యంలో చేపడుతున్న రక్తదాన అవగాహన కార్యక్రమాలను గురించి వివరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ సమన్వయకర్తలు డాక్టర్ ధాత్రికుమారి, సంతోషికుమారి, సుబ్బరత్నమ్మ, విజయకుమారి, మహిళా సాధికారత విభాగ సమన్వయకర్త డాక్టర్ పి.విజయలక్ష్మి, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

65 మందికి ఉచిత వైద్య సేవలు

గుంటూరు మెడికల్: లివర్ సమస్యలను ప్రాథమిక దశలో గుర్తించే ఫైబ్రో స్కాన్‌ను ఉచితంగా 65 మందికి చేశామని కేర్‌వెల్ హాస్పిటల్స్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ షేక్ నాగూర్‌బాషా తెలిపారు. గురువారం స్థానిక గుంటూరువారితోట 7వ లైన్‌లోని కేర్‌వెల్ హాస్పిటల్‌లో ఉచిత వైద్య శిబిరం జరిగింది. ఒక్కో రోగికి సుమారు రూ. 10 వేల ఖరీదు చేసే ఫైబ్రోస్కాన్ పరీక్షలు ఉచితంగా చేశామన్నారు. రెండేళ్లుగా తమ ఆసుపత్రిలో ప్రతినెలా ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించి పేదలకు కార్పొరేట్ వైద్య సేవలు ఉచితంగా అందిస్తున్నామన్నారు. త్వరలోనే ఉచిత వైద్య శిబిరం మరోసారి నిర్వహిస్తామని కేర్ వెల్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ షేక్ గౌస్ బాష తెలిపారు. వైద్య పరీక్షలు చేయించుకోవాలనుకునేవారు ఈ 8341713713, 9854757999 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

డ్వాక్రా మహిళలకు న్యాయం చేయాలి

రేపల్లె: మోసపోయిన డ్వాక్రా మహిళలకు న్యాయం జరిగే వరకు పోరాటాలు కొనసాగిస్తామని సీపీఎం పట్టణ కార్యదర్శి మణిలాల్ అన్నారు. సీపీఎం, ఐద్వా ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్ కట్టా మంగ, కమిషనర్ విజయసారథికి డ్వాక్రా మహిళలు గురువారం సమస్యను విన్నవించి, వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మణిలాల్ మాట్లాడుతూ డ్వాక్రాలో కొంతమంది సభ్యులు బ్యాంకు నుంచి ఎటువంటి రుణాలు పొందలేదని, అయినా ఇటీవల చెల్లించాలంటూ నోటీసులు వచ్చాయన్నారు. విచారణలో వారి పేర్లతో కొంతమంది బ్యాంకర్లతో లాలూచీపడి రుణాలు పొందారన్నారు. మహిళల పేర్లతో రుణాలు పొందిన వారిని, అక్రమ రుణాలు అందించిన బ్యాంకర్లపై చర్యలు తీసుకోవాలని కోరారు. అక్రమాలకు మెప్మా ఆర్పీలు, బ్యాంకర్లపై ఇటువంటి ఘటనలకు పాల్పడకుండా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన చైర్మన్ మంగ మాట్లాడుతూ విచారణ చేపట్టి, సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా రేపల్లె పట్టణ అధ్యక్షురాలు షేక్.జహీదా, కార్యదర్శి షేక్.ఆశ, డ్వాక్రా మహిళలు షబానా సుల్తానా, గౌసే, నాంచారమ్మ పాల్గొన్నారు.

డాక్టర్ సీఎస్ రావుకి మదర్ థెరిస్సా అవార్డు




డాక్టర్ సి.ఎస్.రావును సన్మానిస్తున్న మల్లాది విష్ణు, పుణ్యశీల

గుంటూరు మెడికల్: మదర్ థెరిస్సా సర్వీస్ అవార్డును గుంటూరు నగరానికి చెందిన ప్రముఖ క్లినికల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ సి.ఎస్.రావుకు లభించింది. గురువారం విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో విజయవాడ సెంట్రల్ శాసనసభ్యుడు మల్లాది విష్ణు, ఏపీఐడీసీ చైర్‌పర్సన్ పుణ్యశీల చేతులు మీదుగా అందుకున్నారు. ఎక్సరే సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ మదర్ థెరిస్సా జయంతి ఉత్సవాన్ని పురస్కరించుకొని వివిధ రంగాల్లో విశేష సేవలు అందిస్తున్న రాష్ట్రంలోని పలువురికి వారి సేవలను గుర్తించి వారికి అవార్డును అందజేశారు. అవార్డు అందుకున్న డాక్టర్ సి.ఎస్.రావుకు గుంటూరు లలిత హాస్పిటల్ వైద్యులు, వైద్య సిబ్బంది, జాతీయ బీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శి ముంజంపల్లి శివకుమార్ ప్రత్యేక అభినందనలు తెలిపారు.

రేపు ఉచిత మెగా మెడికల్ క్యాంపు

పట్నంబజారు: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా సెప్టెంబరు 2న ఉచిత మెడికల్ మెగా క్యాంపు నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ వైద్యవిభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ వై. షేక్ చెప్పారు. ఆర్.అగ్రహారంలోని ఆయన కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పేద ప్రజలకు విద్య, వైద్యాన్ని అందించిన మహోన్నత వ్యక్తి మహానేత వైఎస్సార్ కొనియాడారు. ఈనెల 2న పార్టీ జిల్లా కార్యాలయంలో జరిగే వర్ధంతి కార్యక్రమం, అనంతరం ఉచిత వైద్య శిబిరం వైద్యులతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పేదలకు ఉచితంగా వైద్య పరీక్షలు చేయడం జరుగుతోందన్నారు. ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరుగుతోందన్నారు. కార్యక్రమానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాద్, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగంచేసుకోవాలని సూచించారు.

వైభవంగా శ్రీ రామనామక్షేత్రం పవిత్రోత్సవాలు



అలంకరణలో ఉత్సవమూర్తులు

పాత గుంటూరు: ఆర్.అగ్రహారం శ్రీ శృంగేరి శారదా పీఠ పాలిత శ్రీ సీతారామనామ సంకీర్తన సంఘం ట్రస్టీస్ రాగం వెంకట లీలాసుందరి, మస్తాన్‌రావు ఆధ్వర్యంలో శ్రీ రామనామక్షేత్రంలో పవిత్రోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గురువారం శ్రీమాన్ క్రోసూరి మురళీకృష్ణ బృందం శాంతి హోమం, పూర్ణాహుతి, ఉత్సవమూర్తులకు పంచామృతాలతో విశేషంగా అభిషేకార్చనలు నిర్వహించారు. అనంతరం రెండు ఆంజనేయ స్వామి విగ్రహాలను ప్రతిష్ట చేసి పూజలు నిర్వహించారు. రామకోటి స్తూప నిర్మాణానికి శంకుస్థాపన, నూతనంగా నిర్మించిన గోశాలకు విశేష పూజలు నిర్వహించారు. మహా హారతి, మంత్రపుష్పం అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నప్రసాద వితరణ జరిగింది. సభ్యులు కేవీ సుబ్బారావు, అక్కిశెట్టి బాబూరావు, కర్పూరపు శాంతి భూషణ్, పబ్బిశెట్టి రామకృష్ణ పాల్గొన్నారు.

భార్య ఆత్మహత్యకు కారణమైన భర్తపై కేసు నమోదు

కొల్లూరు: భార్య ఆత్మహత్యకు కారణమైన భర్తపై కేసు నమోదు చేసినట్లు కొల్లూరు పోలీసులు తెలిపారు. కొలకలూరుకు చెందిన చొప్పర శారదమ్మకు (37), కొల్లూరుకు చెందిన స్వాములుతో కొన్నేళ్ల క్రితం వివాహమైంది. భార్యభర్తల నడుమ వివాదం చోటుచేసుకోవడంతో నాలుగేళ్ల క్రితం భర్త స్వాములుపై శారదమ్మ కొల్లూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసి, తన ఇద్దరు కొడుకులతో కలసి పుట్టింటికి వెళ్లి, అక్కడే ఉంటోంది. ఇటీవల చిన్న మామ మరణించడంతో చూడటానికి రావడంతో పెద్దలు భార్యాభర్తలు కలసి ఉండాలని, వివాదాలు జరగకుండా సర్దుబాటు చేస్తామని చెప్పడంతో భర్తతో కలసి ఉంటోంది. ఇరువురి మధ్యా మళ్లీ వివాదాలు రావడంతో ఈ నెల 29న భర్త స్వాములు భార్యను కొట్టి, ఇంటి నుంచి వెళ్లిపోవాలని దూషించాడు. దీంతో మనస్తాపానికి గురైన శారదమ్మ అదే రోజు ఇంటిలో పురుగు మందు తాగి, ఆత్మహత్యాయత్నం చేసింది. కుమారుడు, బంధువుల సాయంతో తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లాడు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ ఆమె బుధవారం మృతి చెందింది. వైద్యశాల నుంచి వచ్చిన నివేదిక ఆధారంగా ఎస్ఐ జి. రాజ్యలక్ష్మి ఆత్మహత్యకు కారణమైన భర్తపై గురువారం కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.